క్లుప్తంగా

కళాశాల వార్షికోత్సవం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

గుడుపల్లె: ప్రభుత్వ జూనియర్ కళాశాల 23వ వార్షికోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ మనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులు సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తమ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

కుప్పంరూరల్: చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కుప్పం వ్యవసాయాధికారి ఫయాజ్ అన్నారు. మండలంలోని నడుమూరు గ్రామంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. రైతులు పొలాలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడి, లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఔరంగ్, సచివాలయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

కుప్పంరూరల్: పిల్లలు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు పేర్కొన్నారు. కుప్పం పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంలో బీసీ నాగరాజు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగి గ్రామానికి, దేశానికి సేవ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యులు చెన్నై పొన్నుస్వామి, రోబో గణేష్, చైర్‌పర్సన్ శాంతా నాగరాజు, డా.సునీల్‌రాజ్, సాగర్‌రాజ్ పాల్గొన్నారు.

నీటి డ్రమ్ముల వితరణ

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న గణిత ఉపాధ్యాయుడు వెంకటేశులు సుమారు రూ.16 వేలు విలువ చేసే నీటి డ్రమ్ములను పాఠశాలకు వితరణ చేశారు. హెచ్ఎం నందగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు బోధనతోపాటు తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఉపాధ్యాయుడు కృషి చేయడం సంతోషకరమన్నారు.

డ్రైడే పాటించాలి



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

పలమనేరు: దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రజలు వారానికోసారి ప్రతి శుక్రవారం డ్రైడేను విధిగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సూచించారు. ఆమేరకు మున్సిపాలిటీలో కాకాతోపు, మదనపల్లి రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది ఇళ్లవద్ద నిల్వ ఉన్న నీటిని శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలో నీటిని నిల్వ ఉంచే డ్రమ్ములను ఓ రోజైనా ఎండబెట్టాలని సూచించారు. ఇందులో సూపర్‌వైజర్ జయశంకర్, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతు విశిష్ట రిజిస్ట్రేషన్ల తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న విజయ శంకర్‌రెడ్డి

బైరెడ్డిపల్లె: సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట రిజిస్ట్రేషన్ల ప్రక్రియను బైరెడ్డిపల్లె, లక్కనపల్లె రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ఏడీఓ విజయశంకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టాదారు రైతులు ప్రతి ఒక్కరూ ఏపీఎఫ్ఆర్ పోర్టల్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా పంటలకు సోకే చీడపీడలను ఫొటో తీసి అందులో అప్‌లోడ్ చేస్తే దానికి సంబంధించిన సలహాలు వెంటనే అందుతాయని చెప్పారు.

విశిష్ట గుర్తింపుకు నమోదు చేసుకోండి

శాంతిపురం: మండలంలోని రైతులు అందరూ ఈ నెల 28లోపు విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి అప్పోజి కోరారు. మండలంలో మొత్తం 8,250 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకూ 4,503 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఏవో అప్పోజి

మేత.. కొరత!

గడ్డికి గడ్డుకాలం.. రైతుకు కష్టకాలం

- నెల్లూరు జిల్లా నుంచి రవాణా అవుతున్న రోలింగ్ వరి గడ్డి
- మరోవైపు తమిళనాడు నుంచి భారీగా కొనుగోళ్లు
- వేసవి ఆరంభానికి ముందే పాడి రైతుల అగచాట్లు
- పట్టించుకోని కూటమి సర్కార్

పలమనేరు నియోజకవర్గంలో		
మొత్తం పశువులు	:	90వేలు
మేకలు	:	35వేల
గొర్రెలు	:	38వేలు
బర్రెలు	:	వంద



పలమనేరులో తమిళనాడు నుంచి తెచ్చి అమ్మకానికి పెట్టిన ఎండుగడ్డి

పలమనేరు: పాడి పరిశ్రమను నమ్ముకుని జీవించే కుటుంబాలు అధికంగా ఉన్న పలమనేరు నియోజకవర్గంలో ఈ సారి పశువులకు మేత సమస్య నెలకొంది. పచ్చగడ్డి కొరత తీవ్రంగా ఉండడంతో ఎండు గడ్డిని కొనాల్సివస్తోంది. ఇదే అదనుగా ఎండుగడ్డి ధరలను పెంచేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎండుగడ్డి కట్ట ధర రూ.230 నుంచి రూ.250 వరకు ఉంది. ఇక ట్రాక్టరు లోడ్డు ఎండుగడ్డి ధర రూ.18వేలు పలుకుతోంది. దీంతో పశువులకు మేతకష్టాలు తప్పడం లేదు. ఏటా వేసవిలో పశుగ్రాసం కొరత నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు పశువుల కడుపు నింపడం లేదు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన పశుసంవర్ధకశాఖ సైతం ఎలాంటి చర్యలను చేపట్టలేదు. ఫలితంగా పలమనేరు ప్రాంతంలో పశువులకు మేతకష్టాలు తప్పడం లేదు.

పశుగ్రాస క్షేత్రాలు ఏవీ?

వేసవిలో పశుగ్రాస సమస్యను తీర్చేందుకు వెటర్నరీ అధికారులు గతంలో ఊరూరా పశుగ్రాస క్షేత్రాల పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టింది. నీరు, నేల ఉన్న రైతులను గుర్తించి ఆ పొలంలో పచ్చిమేతను పండించి రైతులకు పచ్చిగడ్డిని అందించడమే దీని లక్ష్యం. పంటసాగు చేసిన రైతుకు కిలో గడ్డికి రూపాయి చొప్పున అప్పట్లో ఇచ్చారు. అయితే ఈ పథకం ఈ కూటమి సర్కారు పాలనలో ఊసేలేకుండా పోయింది.

ఊసేలేని పశుగ్రాస కేంద్రాలు

ఇప్పటికే పశువులకు మేతకరువైంది. కనీసం పశుగ్రాసకేంద్రాలను ఏర్పాటు చేయడంలోనూ వెటర్నరీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అసలు గడ్డి పంపిణీ ఉంటుందో లేదోనన్న అనుమానాలు సైతం తలెత్తుతున్నాయి. దీనికి తోడు వెటర్నరీ ఆస్పత్రుల్లో దాణామృతం పేరిట కరువు దాణాను గతంలో పంపిణీ చేసేవారు. కానీ ఈ సారి మూగజీవాలను ఆదుకొనే ఎలాంటి పనులు లేకుండా పోయాయి. ఇప్పటికైనా అధికారులు పశువుల మేతపై దృష్టి సారించాలని ఇక్కడి పాడిరైతులు కోరుతున్నారు.

బైబ్యాక్‌పాలసీకి మంగళం

పచ్చిమేతను సాగుచేసిన రైతులను గుర్తించి వారి నుంచి ఇతర పాడి రైతులకు గడ్డిని పంపిణీ చేసే కార్యక్రమాన్ని గతంలో వెటర్నరీ అధికారులు చేపట్టారు. గడ్డిని సాగు చేసిన రైతు నుంచి వెటర్నరీ అధికారులు కొనుగోలు చేసి అవసరమైన రైతులకు ఇచ్చేవారు. అయితే ఈ కార్యక్రమాలేవీ ఇప్పుడు లేవు.

ఫాడర్ బేళ్లుకూడా లేవు

పశుసంవర్ధకశాఖ ఫాడర్‌బేళ్లను ఇంకా సరఫరా చేయలేదు. దీనికి సంబంధించిన ఊసే లేదు. ఈ వేసవిలోనైనా బేళ్లు అందుతాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో అయితే ప్రభుత్వం ముందుచూపుతో పాడిపశువులకు ఫాడర్ బేళ్లను గ్రామాల్లో పంపిణీ చేశారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోవు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పశుగ్రాసానికి ఇక్కట్లు తప్పేలా లేవు.

పొరుగు జిల్లా నుంచి గడ్డి

నెల్లూరు జిల్లా నుంచి రోలింగ్ వరిగడ్డి కట్టల లారీలు నిత్యం పదుల సంఖ్యల ఇక్కడికి వస్తున్నాయి. దీంతోపాటు పొరుగునే ఉన్న తమిళనాడు నుంచి ఎండుగడ్డి ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. కొందరు పశుగ్రాసం వ్యాపారులు గడ్డి లోడ్లను కొని ఇక్కడ స్టాకు పెట్టుకొని డిమాండ్‌ను బట్టి అధిక ధరలకు పాడి రైతులకు గ్రాసాన్ని విక్రయిస్తున్నారు.

మేత చాలా కష్టంగా ఉంది



మాకు రెండు ఆవులున్నాయి. ఎక్కడైన బీడుభూముల్లో మేపు కొద్దామంటే అక్కడ మేతలేదు. ఎండుగడ్డిను కొందామంటే కట్ట రూ.230 పెట్టి కొనడం కష్టంగా ఉంది. సరిగ్గా మేతలేక ఆవులు పాలు కూడా తక్కువగా ఇస్తున్నాయి. గతంలో గవర్మెంటోళ్లు ఎండుగడ్డిని పంపిణీ చేస్తా ఉండ్రి. ఈసారి అది కూడా లేదు. మూగజీవాల బాధను చూస్తే ఏమి చేయాల దేవుడా అనిపిస్తుంది.

–రామక్క, పాడి రైతు, క్రిష్టాపురం

కాపాడుకోవడం కష్టమే



పాడి ఆవులను పదేళ్లుగా నమ్ముకున్నా. పాలు బాగా ఇవ్వాలంటే వాటికి పచ్చిమేత, ఎండుమేత, భూసా, గానుగ పిండి కావాలి. వాటి ధరలు చూస్తే భగ్గుమంటున్నాయి. ఇక ఎండుగడ్డి ధరలు పెరిగిపోయాయి. ఇంతచేసి కొన్నా పాలధర గిట్టుబాటు కాలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఎండుగడ్డి పంపిణీ కూడా లేకుండా పోయింది. మూగజీవాల ప్రాణాలు కాపాడుకోవడం కష్టమే.

–గోవిందురెడ్డి, పాడి రైతు, బేరుపల్లి



పలమనేరులో నెల్లూరు రోలింగ్ వరిగడ్డి కట్టల అమ్మకాలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లె పంచాయతీ బొగ్గిటివారిపల్లెలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారని, నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని చెప్పారు. నీటి కోసం సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యశిబిరం



పారిశుధ్య కార్మికులకు వైద్యసేవలందిస్తున్న వైద్యులు

పలమనేరు: మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికులకు శుక్రవారం ప్రత్యేక వైద్య పరీక్షలను స్థానిక వైద్యులు నిర్వహించారు. వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా మూడో శుక్రవారం మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ అవుట్‌డోర్, ఇన్‌డోర్ సిబ్బందికి గ్రీవెన్స్ డే నిర్వహించగా ఎలాంటి అర్జీలు అందలేదని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హెల్త్ ఆఫీసర్ నిరంజన్‌కుమార్, సిబ్బంది, మున్సిపల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు తిరునాళ్ల

సదుం: మండలంలోని ఊటుపల్లె క్రాస్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం 8వ వార్షికోత్సవం పురస్కరించుకుని తిరునాళ్ల నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో అభిషేకాలు, వీధినాటకం, చాందినీ బండ్ల ఊరేగింపు, కోలాటాలు, చెక్కభజనలు నిర్వహిస్తామన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు రక్షణ కరువు



మండల సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏడు నెలల క్రితం బోడిపాటివారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకులను జేసీబీతో కూల్చి వేశారని తెలిపారు. అయితే ట్యాంకులు కూల్చివేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్న ఎందుకు వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మోటుమల్లె గ్రామ పంచాయతీలోని పెండ్లికన్నం గుడి వద్ద ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలకు కొందరు ఇంటికి రూ.25 వేలు చొప్పున వసూలు చేశారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. దీనిపై లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి చెప్పారు. మండలంలో 81 మినీ గోకులం షెడ్లు, గడ్డి పెంపకం యూనిట్లను ఆవుల్లేని వారికి ఎలా ఇస్తారని పశు వైద్య సిబ్బందిని నిలదీశారు. షెడ్లు మంజూరు చేసిన జాబితా తమకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి పథకంలో జరుగుతున్న పనుల వివరాలను పూర్తిగా ఇవ్వాలని ఏపీవో బాల మురళిని కోరారు. గ్రామ పంచాయతీలో తీర్మానాలు చేసి నిధులు మంజూరు చేస్తే తమకు తెలియకుండా పనులు చేస్తున్నారని సర్పంచ్‌లు జీవలత, నాగిరెడ్డి అధికారులపై మండి పడ్డారు. ఎంపీ నిధులతో వంకిరెడ్డిగారిపల్లె, పెద్దగొట్టిగల్లులో ఏర్పాటు చేసి ఆర్వో ప్లాంటును మూసి వేయడం ఏంటని ప్రశ్నించారు. 14 మంది సంఘమిత్రలను అన్యాయంగా తొలగించారని వారు కోర్టులో స్టే తెచ్చినా ఎందుకు పట్టించుకోలేదని ఏపీఎం హరినాథ్‌ను ప్రశ్నించారు. తప్పు చేసిన అధికారులను ఎవరినీ వదలమని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పేదలకు బంజారు భూములకు పట్టాలు ఇస్తే, ఆ రైతుల పేరుతో పట్టాదారు పాసు పుస్తకాలు, పట్టాలను ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కారం చేస్తామని తహసీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యులు వినయ్, ట్రాన్స్‌కో ఏఈ రాం ప్రసాద్, ఎంపీటీసీ సీరాజున్నీసా, రమణమ్మ, సర్పంచ్‌లు సుధారాణి, హేమలత, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాతృభాషపై పట్టు అవసరం





పలమనేరు: బహుమతి అందుకుంటున్న విద్యార్థిని, పుంగనూరు: గిడుగురామమూర్తికి నివాళి

పలమనేరు: విద్యార్థులు మాతృభాషపై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశులు తెలిపారు. స్థానిక కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు, ఉర్దూ, హిందీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు వాసు, హిందీ అధ్యాపకులు బేనేజర్, ఉర్దూ అధ్యాపకులు నిజాముద్దీన్, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశభాషలందు తెలుగు లెస్స

పులిచెర్ల(కల్లూరు): అన్ని భాషల్లో తెలుగు లెస్స అని కల్లూరు హైస్కూలు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు.కల్లూరు హైస్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయలు, అష్ట దిగ్గజ కవుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పుంగనూరు: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృబాషా దినోత్సవాన్ని శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గిడుగురామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రుణాలకు ఇంటర్వ్యూలు

రొంపిచెర్ల/సదుం/గంగవరం/పెద్దపంజాణి: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆయా మండలాల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో శుక్రవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రొంపిచెర్ల మండలంలో 314 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి చెప్పారు. సదుం ఎంపీడీఓ కార్యాలయంలో 223 మంది హాజరు కావాల్సి ఉండగా 212 మంది హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిబాబు తెలిపారు. గంగవరం మండలంలో మొత్తం 521 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. పెద్దపంజాణి మండలంలో 592 మంది దరఖాస్తు చేసుకోగా 413 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ బాలాజి వెల్లడించారు.



రొంపిచెర్ల : ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు



సదుం: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు



గంగవరం: ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు మేనేజర్లు



పెద్దపంజాణి: ఇంటర్వ్యూ చేస్తున్న బ్యాంకర్లు

అగస్త్యేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

పుంగనూరు: మండలంలోని నెక్కుంది కొండలపై ఉన్న అతిప్రాచీన దేవాలయం శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. మార్చి3 వ తేదీ వరకు శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకం, సింహవాహనోత్సవం నిర్వహిస్తామన్నారు.

రాహుకాల అభిషేక పూజలు



చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధిచేసి అమ్మవారి గర్భాలయానికి మామిడి, వేపాకు, పూలతోరణాలతో సుందరంగా ముస్తాబుచేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు.

తొలిరోజు పూజ

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల సమీపం వగళ్లవారిపల్లె సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో తొలిరోజు గంగపూజ, గణపతి పూజలు నిర్వహించారు. యాగశాలలో 11 మంది వేదపండితులు ఆలయ కమిటీ చైర్మన్ గోటూరు మురళీమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలశాలను ఊరేగింపు తీసుకొచ్చి భక్తి శ్రద్ధలతో సమర్పించారు.

24న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 24న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

25న మండలంలో..

పలమనేరు మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు సంబంధిత బ్యాంకు మేనేజర్లు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఖాదర్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని యూనియన్‌బ్యాంకు, కెనరాబ్యాంకు, కొలమాసనపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకులకు దరఖాస్తు చేసుకున్న వారు మాత్రం మధ్యాహ్నం 2 గంటలకు అవసరమైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

పుంగనూరులో..

పుంగనూరు: బీసీ కార్పొరేషన్ రుణలకు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు, దరఖాస్తుదారులతో కలసి ఇంటర్వ్యూలు నిర్వహిరచనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

ఆరో తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం: మండల పరిధిలోని నడుమూరు ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ హరిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.75 చెల్లించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 91825 09166ను సంప్రదించాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో..

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంటలో ఉన్న మోడల్ స్కూల్లో 6వ తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ రమ కోరారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు విద్యార్థులు ఈ నెల 24 నుంచి 31 వరకు ప్రవేశ పరీక్షల రుసుము చెల్లించాలని, 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న పరీక్షలు నిర్వహించి, 27న మెరిట్ లిస్టు, అదే రోజున ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రచురిస్తామన్నారు. 30న సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జూన్‌లో క్లాసులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు మోడల్ స్కూల్ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

పుష్పపల్లకిలో వీరాంజనేయస్వామి

వి.కోట: పట్టణ నడిఒడ్డున వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి వారి పుష్పపల్లకీ సేవ శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు దండోప తండాలుగా వచ్చి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. సాయంత్రం స్వామివారికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. రాత్రి 10 గంటలకు స్వామి వారిని పుష్పపల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో వైభవంగా ఊరేగించుతారు. ఈ పల్లకి ముందు బుట్టబొమ్మలు, పొడవు కాళ్ల బొమ్మలు, కోలాటాలు, పండరీ భజనలు తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి పల్లకి సేవను తిలకించారు. స్వామి వారి పల్లకి సేవ రాత్రి 10 గంటలకు ప్రారంభమై శనివారం వేకువజాము వరకు కొనసాగింది.




ఆలయం వద్ద అన్నదానం



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి





భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం, ప్రత్యేక అలంకరణలో శ్రీ వీరాంజనేయ స్వామి